సాక్షి
కాకినాడ
బుధవారం | 24 | జనవరి | 2024



వెంకన్నకు బంగారు జంధ్యం

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామికి జవ్వాది కృష్ణమోహన్, సత్యవతి దంపతులు (కొంకాపల్లి) రూ.లక్ష విలువైన 14 గ్రాముల బంగారు జంధ్యాన్ని సమర్పించారు.



వకుళమాత భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత భవనానికి యర్రంశెట్టి పూర్ణ రవికాంత్, దుర్గాలక్ష్మి దంపతులు (హైదరాబాద్) రూ.51,116 విరాళం అందజేశారు.

డెల్టాలకు 10,950 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 10,950 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ రవి చీమలపాటికి సత్యదేవుని చిత్రపటాన్ని బహూకరిస్తున్న దేవస్థానం ఈఓ రామచంద్ర మోహన్

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకుని, పూజలు చేశారు. వారికి ఆలయం వద్ద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించిన అనంతరం పండితులు వేదాశీస్సులు, దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ స్వామివారి ప్రసాదాలు అందజేశారు. జస్టిస్ రవి వెంట పలువురు న్యాయాధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అపోలో ఫార్మసీలో 100, డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లో 400, జీవీఎస్ టెక్నాలజీలో 120 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయన్నారు. ఫార్మసీ లేదా ఎలక్ట్రికల్, కెమిస్ట్రీ చదివిన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 96521 42169 నంబరులో సంప్రదించాలన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లపై నేటి నుంచి శిక్షణ



రామలక్ష్మి పట్నాయక్

కాకినాడ లీగల్: నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకంలో నిర్మిస్తున్న ఇళ్ల రిజిస్ట్రేషన్‌పై గ్రామ సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్లకు బుధవారం నుంచి శిక్షణ ఇస్తున్నారు. జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్ మంగళవారం ఈ విషయం తెలిపారు. ఈ పథకంలో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలానికి మార్కెట్ రేటు నిర్ణయించామన్నారు. జిల్లావ్యాప్తంగా 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న 230 గ్రామాల్లోని సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలకు రిజిస్ట్రేషన్ల విధానంపై శిక్షణ ఇస్తామన్నారు. అలాగే డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం శిక్షణ ఇస్తామని తెలిపారు.

జీజీహెచ్‌లో పీఆర్‌పీ యూనిట్ ప్రారంభం

కాకినాడ క్రైం: జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగంలో ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా (పీఆర్‌పీ) యూనిట్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి మంగళవారం ప్రారంభించారు. అలాగే, ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు ప్రమాదాలు ఇతర అత్యవసర వేళల్లో క్షతగాత్రులకు ఎముకలు విరిగిన సందర్భాల్లో తీవ్రత పెరగకుండా నిలువరించే అధునాతన పరికరాలను ప్రారంభించారు. దీర్ఘకాలిక ఎముకల నొప్పులతో పాటు స్టెరాయిడ్లు, ఇతర దుష్ప్రభావాలు అధికంగా ఉన్న మందులు వినియోగించే రోగులపై ఎటువంటి ప్రతికూలతలూ చూపని సురక్షిత ప్రక్రియ పీఆర్‌పీ అని ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ విఠల్ తెలిపారు. రోగి సొంత రక్తం నుంచి సేకరించే ప్లేట్‌లెట్‌లు అధికంగా ఉండే ప్లాస్మాను ఈ ప్రక్రియలో ఇంజక్షన్ల రూపంలో ఇస్తారన్నారు. ఇది దీర్ఘకాలిక ఎముకల సమస్యలతో బాధపడే రోగులకు ఎంతో సాంత్వననిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ పుష్కరరావు, ఆర్ఎంఓ డాక్టర్ రాహుల్, ప్రొఫెసర్లు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ముఖర్జీ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాంకిషోర్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

25న మినీ జాబ్ మేళా

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో గురువారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ మేళాలో ఎల్ఐసీ, టాటా ఎలక్ట్రానిక్స్, అపోలో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. వీటిల్లో వివిధ ఉద్యోగాలకు ఫార్మసీ, ఇంటర్, పదో తరగతి పూర్తి చేసిన 19 నుంచి 40 సంవత్సరాల్లోపు వయస్సు వారు అర్హులని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు 'స్కిల్ యూనివర్సిటీ.ఏపీఎస్ఎస్‌డీఎస్.ఇన్' వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, జాబ్ మేళాకు రెజ్యూమ్‌తో పాటు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో ఆ రోజు ఉదయం 10 గంటలకు రావాలని కోరారు. వివరాలకు 91339 12947, 73967 40041 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు

ఆర్థిక పురోగతికి ఆసరా

- కలెక్టర్ కృతికా శుక్లా
- డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రుణమాఫీ విడుదల
- 3,76,071 మందికి రూ.300.47 కోట్ల లబ్ధి
- నాలుగు విడతల్లో రూ.1,200 కోట్లు అందించినట్టు వెల్లడి

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక పురోగతికి ఎంతో దోహదపడుతోందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాల మహిళలకు ఉన్న బ్యాంకు రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేసే వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కాడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళా సాధికారత మరింత మెరుగుపడుతుందని అన్నారు. ఈ పథకం కింద నాలుగు విడతల్లో జిల్లాలోని డ్వాక్రా మహిళలకు దాదాపు రూ.1,200 కోట్ల మేర ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని తెలిపారు. నాలుగో విడతలో 37,525 గ్రూపుల్లోని 3,76,071 మంది మహిళలకు రూ.300.47 కోట్ల మేర లబ్ధి కలిగిందన్నారు. వచ్చే రెండు వారాల్లో ఆసరా సొమ్మును మండలాల వారీగా స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆయా పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేసి, అవగాహన కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సొమ్ము పొదుపు సంఘాల మహిళలు తమ రుణ భారాన్ని తగ్గించుకునేందుకు, వారి వ్యాపారాల వృద్ధికి సహాయపడుతుందని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వాతంత్ర్యానికి పునాది



నేను ఇంటి వద్దనే టైలరింగ్ పని చేసుకుంటున్నాను. ఆసరా పథకం కింద నాలుగు విడతల్లోనూ ఆర్థిక సాయం పొందాను. అలాగే అమ్మ ఒడి, డ్వాక్రా రుణ మాఫీ కింద లబ్ధి చేకూరింది. 2019లో అధికారం చేపట్టినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి మా ఆర్థిక స్వాతంత్ర్యానికి పునాది వేశారు. ఆయనకు మహిళలందరం రుణపడి ఉంటాం.

– సంగాని సుభాషిణి, జగన్నాథపురం, కాకినాడ

ఆర్థిక రుణభారం తగ్గింది



వితంతువునైన నేను ఇంటి వద్ద సొంతంగా వస్త్ర వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద మా గ్రూపునకు రూ.4.40 లక్షల లబ్ధి చేకూరింది. ఈ పథకం ద్వారా మాకు రుణ భారం తగ్గింది. అంతేకాకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే రూ.3 వేల వితంతు పింఛన్ అందుకుంటున్నాను. మహిళలకు ఇంత మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– గరికిన నూకరత్నం, తూరంగి, కాకినాడ రూరల్ మండలం

ఉపాధికి ప్రణాళిక

- 2024–25లో పనుల గుర్తింపునకు కసరత్తు
- పని దినాల లక్ష్యం 66 లక్షలు
- నెలాఖరుకు ప్రక్రియ పూర్తి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

జాబ్ కార్డులు	2,74,000
కూలీలు	4,48,000
యాక్టివ్ జాబ్ కార్డులు	2,07,000
యాక్టివ్ కూలీలు	3,15,000

కాకినాడ సిటీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో పనుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, పనుల గుర్తింపులో సిబ్బంది నిమగ్నమయ్యారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి 31తో గడువు ముగుస్తుంది. ఆ తర్వాత 2024–25 సంవత్సరంలో పనుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని ఉపాధి హామీ పథకం సిబ్బంది పనులను గుర్తించి, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రజల అవసరాలను బట్టి గ్రామసభల ద్వారా ఈ నెలాఖరులోగా పనులను గుర్తించి, అందుకు సంబంధించిన పని దినాలు నిర్ణయించనున్నారు. నిర్మాణాత్మక పనులు చేపట్టేందుకు ఏ మేరకు నిధులు అవసరమవుతాయో అంచనా వేసుకుని, సంబంధిత శాఖకు నివేదికలు అందజేయనున్నారు.

వేతనాలకు రూ.190.67 కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 66 లక్షల పని దినాలు కల్పించాలని నిర్ణయించారు. దీనికి వేతనాలుగా దాదాపు రూ.190.67 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా పని దినాల లక్ష్యం 66 లక్షలు కాగా, ఇప్పటి వరకూ 59.84 లక్షల పని దినాలు కల్పించారు. వచ్చే మార్చి నాటికి లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.

మెటీరియల్‌కు రూ.66.07 కోట్లు

ఉపాధి హామీ పనులకు అవసరమైన సామగ్రికి సంబంధించి వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.66.07 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు, రైతుభరోసా కేంద్రాలు, సిమెంటు రోడ్లు తదితర నిర్మాణాత్మక పనులు చేపడతారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెటీరియల్‌కు రూ.48.69 కోట్లు, వేతనాల కింద రూ.136.87 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.205.57 కోట్లు కాగా, 2024–25లో ఇది దాదాపు రూ.300 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

చేపట్టే పనులు

ఉపాధి హామీలో ప్రధానంగా చెరువుల పునరుద్ధరణ (అమృత్ సరోవర్), కొత్త చెరువుల నిర్మాణం, నీటి కందకాలు, పర్కులేషన్ పాండ్స్, గట్లపై మొక్కలు నాటడం, హార్టికల్చర్, మునగ సాగు, ఎవెన్యూ ప్లాంటేషన్, పచ్చదనం పెంపు, పశువుల షెడ్లు, కాలువల మరమ్మతులు, రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణం తదితర పనులు చేపడతారు. ప్రణాళికల అమలులో కొత్త పనులు కూడా గుర్తిస్తారు.

ప్లాంటేషన్లు ఇలా..

ప్లాంటేషన్‌లో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 430.53 ఎకరాల్లో పండ్ల తోటలు నాటారు. హార్టికల్చర్‌లో భాగంగా ఫ్లోరికల్చర్‌లో గులాబీ, మల్లె సాగు 12.75 ఎకరాలు, మునగ సాగు 15 ఎకరాలు, కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో భాగంగా 51.93 కిలోమీటర్లు, బ్లాక్ ప్లాంటేషన్‌లో 'వసుధకు వందనం' కార్యక్రమంలో భాగంగా 487.70 ఎకరాల్లో వివిధ మొక్కలు నాటారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 27 వేల పనులు చేపట్టారు.

లక్ష్య సాధనకు కృషి



వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులు గుర్తించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే ఒక అంచనాకు రాగా, పూర్తి నివేదికలు అందాక మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే మార్చి నెలాఖరుకు లక్ష్యాన్ని చేరుకోవడానికి క్షేత్రస్థాయిలో అన్ని చర్యలూ చేపడుతున్నాం.

– అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ

విధుల్లోకి అంగన్‌వాడీలు

కాకినాడ సిటీ: ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో 42 రోజుల అనంతరం సమ్మె విరమించిన అంగన్‌వాడీ ఉద్యోగులు మంగళవారం విధులకు హాజరయ్యారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది విధుల్లో చేరారు. అంగన్‌వాడీ ఉద్యోగుల 11 డిమాండ్లలో ప్రభుత్వం పదింటిని ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత బీమా వర్తింపజేసేందుకు, రూ.2 లక్షల ప్రమాద బీమా ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అద్దె భవనాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.66.54 కోట్లు, చీపుర్లు, బకెట్లు, మగ్గులు, ఫినాయిల్, సబ్బులు, స్టేషనరీ వంటి అవసరాలకు రూ.7.81 కోట్లు మంజూరు చేసింది. సొంత భవనాల నిర్వహణకు ఒక్కో కేంద్రానికి రూ.3 వేల చొప్పున రూ.6.36 కోట్లు విడుదల చేసింది. అంగన్‌వాడీ సహాయకులను కార్యకర్తలుగా నియమించేందుకు వయోపరిమితిని 45 నుంచి 50 సంవత్సరాలకు పెంచింది. అలాగే, అంగన్‌వాడీ వర్కర్లకు నెలకోసారి, హెల్పర్లకు రెండు నెలలకోసారి టీఏ, డీఏ క్లెయిమ్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సిబ్బంది గరిష్ఠ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచింది. 62 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ వర్కర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.40 వేల చొప్పున సర్వీసు ముగింపు ప్రయోజనాలు అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 10 డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించడంతో అంగన్‌వాడీ ఉద్యోగులు ఎట్టకేలకు సమ్మె విరమించారు.



సామవేదం షణ్ముఖశర్మను సత్కరిస్తున్న సీతారామచంద్ర ఘనపాఠి

ఉన్నత వ్యక్తిత్వం.. సమున్నత వాత్సల్యం

- రామావతారంలో గోచరం
- సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్) ఉన్నత వ్యక్తిత్వం, సమున్నత వాత్సల్యం రాముని అవతారంలో చూడవచ్చునని సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. హిందూ సమాజంలో ఆయన చేస్తున్న శ్రీరామాయణ ప్రవచనాలు 42వ రోజైన మంగళవారం ముగిశాయి. సీతను అగ్నిభట్టారకుడు తీసుకు వచ్చినప్పుడు ప్రజల అపవాదును దూరం చేయడానికే తాను ఉపేక్ష భావం వహించానని, సీతను అగ్ని దహించదనే విషయం తనకు తెలుసని రాముడు అంటాడని అన్నారు. పాలకునిగా తాను అపవాదులకు దూరంగా ఉండాలన్నది రాముని అభిమతమని చెప్పారు. బ్రహ్మాది దేవతలు వచ్చి రాముని స్తోత్రం చేస్తారని, బ్రహ్మ చేసిన స్తోత్రంలో రాముని విరాట్ స్వరూపం గోచరిస్తుందని అన్నారు. దశరథుడు దివ్య విమానంలో వచ్చి, రాముని ఒడిలో కూర్చోబెట్టుకుని, 'నాయనా! నన్ను సత్యసంధునిగా నిలబెట్టావు. నిన్ను పుత్రునిగా పొంది నేను ధన్యుడనయ్యాను' అని అంటాడని చెప్పారు. 'తండ్రీ! కైకేయి, భరతుల పట్ల నీ పరుష వచనాలను ఉపసంహరించు. ఇదే నా కోరిక' అని రాముడు అడుగుతాడన్నారు. తన కోసం యుద్ధంలో మరణించిన వానరులందరినీ బతికించమని ఇంద్రాది దేవతలను కోరతాడని చెప్పారు. 'పుష్పకంలో తిరిగి వచ్చిన రామునికి భరతుడు తాను తీసుకువచ్చిన బంగారు పాదుకలు తొడుగుతాడు. అన్నా! ఈ పవిత్రమైన నీ పాదుకల పాలనలో నీ కోశాగారం పది రెట్లు అయింది' అని చెబుతాడన్నారు. రాముడు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి కలుగుతుందని షణ్ముఖశర్మ చెప్పారు.

కన్నుల పండువగా పట్టాభిషేకం

ప్రణవ తత్త్వమే రామ పట్టాభిషేకమని, రామోపాసనకు పరిపూర్ణత్వం పట్టాభిషేక సర్గ పారాయణతో లభిస్తుందని సామవేదం అన్నారు. వివిధ నదీజలాలు, సాగరాల నుంచి తెచ్చిన జలాలతో, రత్నమయమైన సింహాసనం మీద రాముని పట్టాభిషేకం జరిగిందని చెప్పారు. ప్రవచన వేదికపై శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. రామరాజ్య వైభవాన్ని సామవేదం వివరించారు. ప్రవచనానికి ముందు కొంతమూరులోని శ్రీ దత్తాత్రేయ వేదవిద్యా గురుకులాన్ని సందర్శించిన సామవేదం షణ్ముఖశర్మను గురుకుల నిర్వాహకుడు, స్వాధ్యాయరత్న గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనపాఠి 'ఆర్షవిజ్ఞాన సముద్ధరణ దీక్షిత' బిరుదుతో సత్కరించారు.

రోడ్డు భద్రతపై ఫోకస్

- నెల రోజుల పాటు రవాణా శాఖ కార్యక్రమాలు
- స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన సదస్సులు
- రహదారి ప్రమాదాల నివారణకు సూచనలు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రోడ్డు భద్రతపై రవాణా శాఖ ఫోకస్ పెట్టింది. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గతంలో ఏడాదికోసారి జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించేవారు. దీనికి భిన్నంగా ఈసారి పోలీసులు, ఆర్అండ్‌బీ, వైద్య, ఆరోగ్యం తదితర శాఖల సమన్వయంతో మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళ, బుధవారాల్లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించి జాతీయ, రాష్ట్ర రహదారులపై బ్లాక్ స్పాట్లలో వచ్చే ఏడాదికల్లా ప్రమాదాల నివారణకు ప్రణాళికలు రూపొందిస్తారు. 25, 27 తేదీల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు, స్థానిక మంత్రులతో కలిసి కళాశాల విద్యార్థులతో వాక్‌థాన్ నిర్వహిస్తారు. 29న డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తారు. 30, 31 తేదీల్లో విద్యా సంస్థల్లో డ్రైవర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, ప్రిన్సిపాళ్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం చేపడతారు. ఫిబ్రవరి 1 నుంచి మూడు వరకూ బైక్ ర్యాలీలు నిర్వహిస్తారు. వీటిలో ముఖ్యంగా మహిళా ద్విచక్ర వాహనదారులను భాగస్వాముల్ని చేస్తారు. హెల్మెట్ ధారణ, సీటు బెల్టు వినియోగంపై అవగాహన కల్పిస్తారు. మద్యం తాగి వాహనం నడపడం, డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడటం వలన కలిగే అనర్థాలను వివరిస్తారు. 5, 6 తేదీల్లో గుడ్ సమరిటన్ లాస్‌పై ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తారు. ఏడో తేదీన ఇంజినీరింగ్ కళాశాలల ప్రొఫెసర్లు, జాతీయ, రాష్ట్ర రహదారుల అధికారుల అవగాహన సదస్సు నిర్వహిస్తారు. రోడ్డు భద్రతపై 8, 9 తేదీల్లో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో స్థానిక ఆటోమొబైల్ డీలర్లను భాగస్వాములను చేస్తారు. 12న రహదారి భద్రతపై మోటార్ వాహనాల సవరణ చట్టం కొత్త నిబంధనలను వివరిస్తారు. 13న ప్రజా రవాణాలో మహిళల కోసం ఆర్టీసీ, మ్యాక్సీ, మోటార్ క్యాబ్‌ల డ్రైవర్లు, యజమానులకు సదస్సు నిర్వహిస్తారు. 14, 15 తేదీల్లో వాహనాల బీమాపై ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, సూపర్‌వైజర్లకు వర్క్‌షాపు జరుగుతుంది. 16న సరకు రవాణా వాహనాల డ్రైవర్లు, యజమానులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. 17న బడి పిల్లలకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. 19న రహదారి భద్రత కార్యకలాపాల్లో ఉత్తమ వలంటీర్లు, నిర్వాహకులకు అవార్డులు, బహుమతులు ప్రదానం చేస్తారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రతి రోజూ షెడ్యూల్ రూపొందించి, అన్ని వర్గాల వారినీ సమన్వయం చేసుకుంటూ వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం.

– ఎ.మోహన్, జిల్లా రవాణా అధికారి, కాకినాడ

ఎస్సై భానుప్రసాద్‌కు పతకం



మారథాన్‌లో విజేతగా నిలిచిన భానుప్రసాద్

అమలాపురం టౌన్: టాటా ముంబై మారథాన్ పోటీలో అమలాపురం క్రైమ్ ఎస్సై జక్కంశెట్టి భానుప్రసాద్ విజేతగా నిలిచి ఫినిషర్ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ నెల 21వ తేదీన ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ రైల్వే టెర్మినల్ నుంచి ప్రారంభమైన ఈ మారథాన్‌లో ఎస్సై భానుప్రసాద్ పాల్గొన్నారు. ఈ పోటీలో ఎస్సై 42.2 కిలోమీటర్ల దూరం మారథాన్ చేసి కేవలం 3.55 గంటల్లో గమ్యాన్ని చేరుకున్నారు. దేశ వ్యాప్తంగా ఈ పోటీలో 59 వేల మంది పాల్గొనగా 35–39 సంవత్సరాల వయసు కేటగిరీలో ఎస్సై భానుప్రసాద్ 220 ర్యాంక్ సాధించారు. ఓవరాల్‌గా 1,139వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నారు. గత ఆగస్టులో హైదరాబాద్‌లో ఎంఎడీసీ ఆధ్వర్యంలో జరిగిన మారథాన్‌లో 4.2 కిలోమీటర్లు నిర్వహించినప్పుడు కూడా ఎస్సై భానుప్రసాద్ పాల్గొని పతకాన్ని సాధించారు. ఎస్సై భానుప్రకాష్‌ను ఎస్పీ ఎస్.శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, స్పెషల్ బ్రాంచి సీఐలు బి.రాజశేఖర్, వి.శ్రీనివాస్ అభినందించారు.

మద్యం, నగదు రవాణాపై గట్టి నిఘా

అమలాపురం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు విచ్చలవిడిగా రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా అమలు చేయాలని డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు అధికారులకు సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు సాంకేతిక అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం డీఆర్‌ఓ సత్తిబాబు మాట్లాడుతూ, పెద్ద మొత్తంలో నగదు విత్‌డ్రా చేసేవారిపై బ్యాంకర్లు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వెండి, బంగారం వస్తువులు రవాణా కాకుండా వాణిజ్య పన్నుల శాఖ చెక్‌పోస్ట్ వద్ద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మద్యం రవాణాపై ఎస్ఈబీ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అటవీ చెక్‌పోస్ట్‌ల వద్ద కూడా ఓటర్లను ప్రభావితం చేసే బహుమతుల బల్క్ రవాణా అంశాలపై నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.శ్యాంబాబు, డీఎఫ్‌ఓ ఎంవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు


విలేకరులతో మాట్లాడుతున్న రాజా

పెద్దాపురం: నాటకం పల్లెపల్లెకు చేరాలనే ఉద్దేశంలో నాటక కళా పరిషత్ పోటీలు నిర్వహిస్తున్నట్టు స్నేహ ఆర్ట్స్ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా అన్నారు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో బుధవారం తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీల గురించి విలేకరులకు ఆయన వివరించారు. కళలు మానసిక ఉల్లాసం కోసమే కాదని, జన జాగృతి కోసం, చైతన్యం కోసమన్నారు. నాటకం పల్లె పల్లెకు చేరాలనే ఉద్దేశంతో మూడేళ్ల కిందట పరిషత్‌ను స్నేహ ఆర్ట్స్ ఏర్పాటు చేసిందన్నారు. మూడు రోజుల పాటు ఏడు నాటికల ప్రదర్శన ఉంటుందని రాజా తెలిపారు. 24వ తేదీన రాత్రి ఏడు గంటలకు కళా పరిషత్ పోటీలను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి, డీఎస్పీ లతాకుమారి ప్రారంభిస్తారన్నారు. తొలిరోజున రెండు నాటికలు, 25వ తేదీన రెండు, 26వ తేదీన మూడు నాటిక ప్రదర్శనలుంటాయన్నారు. యిందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, కేదారి నాగు, గొందేసి సత్యానందం, వెన్నా పండు, నూకలమంతి నానాజీ పాల్గొన్నారు.

రేపు పాదగయ క్షేత్ర ప్రదక్షిణ

పిఠాపురం: పాదగయ క్షేత్ర ప్రదక్షిణ నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలోగురువారం ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గిరి ప్రదక్షిణ మాదిరిగా ఆలయ ప్రదక్షిణ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు పతంజలి యోగా సమితి యోగా శిక్షక్ ఎస్.శ్రీనివాస్ 7013666716 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

శత శాతం భవతి

- మరో 30 రోజుల్లో ఇంటర్ పరీక్షలు
- సిద్ధమవుతున్న విద్యార్థులు
- ఏర్పాట్లలో ఆర్జేడీ, ఆర్ఐవో కార్యాలయ అధికారులు


ఇంటర్ విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా ఇంటర్ విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణను చేపట్టి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఇంటర్‌బోర్డు అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇందుకుగాను ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు జిల్లా అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు స్పష్టమైన అదేశాలు జారీ చేశారు. సంక్రాంతి సెలవుల తర్వాత అధికారులు, అధ్యాపకులు పూర్తిస్థాయిలో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

2023 – 24 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్ పరీక్షలు మార్చి మొదటి తేదీన ప్రారంభమై అదే నెల 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉన్న ఈ అతి తక్కువ రోజుల్లో విద్యార్థులు పరీక్షల్లో ఎలా మంచి ఫలితాలు సాధించాలి అనే దానిపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. హైస్కూల్ ప్లస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించి ప్రతి రోజూ విద్యార్థులకు ప్రత్యేకంగా నమూనా పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేకంగా తరగతులను నిర్వహించి వెనుకబాటు ఉన్నవారిపై దృష్టి సారించారు. కళాశాలకు దూరంగా ఉన్న విద్యార్థులను సైతం కళాశాలకు తీసుకొచ్చి వారు పరీక్షలకు హాజరయ్యేందుకు సమాయత్తం చేస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం



ఇంటర్ పరీక్షలకు సంబంధించి పూర్తి ప్రణాళిక రూపొందించాం. ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. ఇంటర్ బోర్డు అధికారులను పూర్తి అప్రమత్తం చేశాం. నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా చర్యలు చేపట్టాం. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించే దిశగా అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సూచనలతో కూడిన ఆదేశాలు జారీ చేశాం. అందరం కలసి ఉమ్మడిగా కసరత్తు ప్రారంభించాం. జిల్లాలకు మంచి ర్యాంకు తీసుకువస్తాం.

– శారద, రీజినల్ జాయింట్ డైరెక్టర్, ఇంటర్ బోర్డు, రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా

జిల్లాలో 127 కళాశాలలుండగా వాటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 16, హైస్కూలు ప్లస్ 16, సోషల్ వెల్ఫేర్ 5, ఎయిడెడ్ 2, ప్రైవేట్ కళాశాలలు 88 ఉన్నాయి.
- ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు మొత్తం 21,366
- ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 20.016
- రెండు సంవత్సరాలకు మొత్తం 41,382 మంది

కాకినాడ జిల్లా

జిల్లాలో 146 కళాశాలలుండగా వాటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 15, హైస్కూలు ప్లస్ 14, సోషల్ వెల్ఫేర్ 8, ఎయిడెడ్ 3, కేజీబీవీ 4, మోడల్ స్కూల్స్ 2, ప్రైవేట్ కళాశాలలు 100 ఉన్నాయి.
- ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 22,059
- ఇంటర్ ద్వితీయ సంవత్సరంవిద్యార్థులు 22,120
- రెండు సంవత్సరాలకు మొత్తం 44,179 మంది

కోనసీమ జిల్లా

జిల్లాలో 146 కళాశాలలుండగా వాటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13, హైస్కూలు ప్లస్ 21, సోషల్ వెల్ఫేర్ 6, ఎయిడెడ్ 1, ప్రైవేట్ కళాశాలలు 105 ఉన్నాయి.
- ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 14,000
- ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 12,000
- రెండు సంవత్సరాలకు మొత్తం 26,000 మంది

నాణేలతో అయోధ్య రామాలయ నమూనా


సుబ్రహ్మణ్యం తయారు చేసిన అయోధ్య బాలరాముని ఆలయం

అమలాపురం రూరల్: అమలాపురం భారతీయ స్టేట్ బ్యాంకు ఉద్యోగి, నాణేల సేకరణ కర్త ఇవటూరి రవి సుబ్రహ్మణ్యం అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భట్లపాలెం గ్రామంలో ఒకటి,ఐదు రూపాయల నాణేలను ఉపయోగించి అయోధ్య రామాలయ నమూనాను తయారు చేశారు. ముందుగా ఆలయ నమూనా చిత్రాన్ని ఆర్టిస్ట్ శ్రీనివాస్‌వేయగా సుబ్రహ్మణ్యం దానిపై ఒక రూపాయి ఐదు రూపాయల నాణేలను ఆలయ నమూనా ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. రామాయణంలోని ఏడు కాండలకు ప్రతీకగా ఏడు వేల రూపాయలు విలువగల నాణేలను ఆలయ నమూనా ఆకారంలో పేర్చానని సుబ్రహ్మణ్యం తెలిపారు. నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్, భట్లపాలెం అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు సురేష్ సహకరించారు.

అయోధ్యకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు


రావులపాలెం నుంచి ఆయోధ్యకు బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం అయోధ్యకు సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సు బయలుదేరినట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. అయోధ్యలోని నూతన రామ మందిరం దర్శనం నిమిత్తం భక్తుల సౌకర్యార్థం అయోధ్యకు ఆర్టీసీ నుంచి మొట్టమొదటి సర్వీస్ గా రావులపాలెం నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరినట్టు తెలిపారు. 13 రోజుల తీర్థయాత్రలో అన్నవరం, సింహాచలం, అరసవల్లి, పూరి క్షేత్రం, కోణార్క్, భువనేశ్వర్, సాక్షి గోపాలం, జాజిపూర్, బుద్ధగయ, కాశీ, త్రివేణి సంగమం, శీతామడి, ప్రయోగ, అయోధ్య రామమందిరం, నైమిశారణ్యం దేవాలయాల దర్శనం అనంతరం ఫిబ్రవరి 4న బస్సు తిరిగి రావులపాలెం చేరుతుందన్నారు. మొదటి బస్సు స్ఫూర్తితో అయోధ్యకు రెండో బస్సును ఫిబ్రవరి నెలలో పంపడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు డీఎం తెలిపారు. టికెట్ ధర రూ.10,550గా నిర్ణయించినట్టు తెలిపారు. భోజన, వసతి ఏర్పాట్లు ప్రయాణికులే చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ 7382911871ను సంప్రదించాలన్నారు.

జాతీయ మహిళా వాలీబాల్ టోర్నీ విజేత సౌత్ సెంట్రల్ రైల్వే


విజేతగా నిలిచిన టీమ్‌తో గ్రామస్తులు

మలికిపురం: మలికిపురం మండలం తూర్పుపాలెంలో జరుగుతున్న జాతీయ మహిళా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ముగిశాయి. హోరా హోరీగా సాగిన పోటీలలో సౌత్ సెంట్రల్ రైల్వే టీం మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. రెండవ స్థానం ఐసీఎఫ్ టీం, మూడవ స్థానంలో కేరళ పోలీస్ టీం విజేతగా నిలిచాయి. అత్యధిక ప్రతిభ కనబరిచిన టీమ్‌లకు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేశారు. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఎస్పీ ఎస్.శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జాతీయస్థాయిలో మహిళా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం సాధారణ విషయం కాదని అన్నారు. టోర్నీని ఎంతో చక్కగా సమర్థంగా నిర్వహించిన ఏసీఎఫ్ ఫౌండేషన్‌ను అభినందించారు. ఏఎస్ఎఫ్ చైర్మన్ వేణు గోపాల్ మాట్లాడుతూ ఇటువంటి టోర్నమెంట్లను ముందు ముందు ఇంకా నిర్వహిస్తామని తెలిపారు. అడబాల వీర బ్రహ్మాజీరావు, తాత కాపు గోపాల కృష్ణ, అడబాల రాంబాబు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న జాతీయ టెన్నిస్ పోటీలు


డీఎస్ఏలో మంగళవారం రాత్రి క్యాంప్ ఫైర్‌ను వెలిగిస్తున్న ఆర్జేడీ నాగమణి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న 67వ జాతీయస్థాయి అండర్–19 లాన్ టెన్నిస్ పోటీలు మంగళవారం 4వ రోజు స్ఫూర్తిదాయకంగా జరిగాయి. నాలుగో రోజు 18 మ్యాచ్‌లను నిర్వహించారు. ఈ మ్యాచ్‌లను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, ఆర్జేడీ నాగమణి, టోర్నమెంట్ పరిశీలకులు రామిరెడ్డి ప్రారంభించారు. సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో క్రీడాకారులు విజయం కోసం పట్టుదలతో ఆడారు. క్వార్టర్స్‌లో వహిన్ పటేల్ (గుజరాత్)7–5 స్కోర్‌తో రివర్దన్(కర్ణాటక)పైన, అర్జున్ రాఠీ(హర్యానా) 6–4 స్కోర్‌తో జాన్‌రోహన్(తమిళనాడు) పైన, శాండిల్య (తెలంగాణ)7–5 స్కోర్‌తో అవాంపారిఖ్ (గుజరాత్) పైన, వి.ధీరజ్(తెలంగాణ) 7–0 స్కోర్‌తో అశ్వజిత్ (ఛండీఘర్)పైన విజయం సాధించారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు, ఉపాధ్యాయులు, అధికారులతో క్యాంప్ ఫైర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ క్యాంప్ ఫైర్‌ను ఆర్జేడీ నాగమణి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మంగవారం నిర్వహించిన మ్యాచ్‌లను రాష్ట్ర పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు, పోటీల నిర్వహణా కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ రిఫరీ శ్రీకుమార్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో కేసరి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు మాజరరావు, ఎన్.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, ఆర్‌కేడీ ప్రసాద్, ఎండి హుస్సేన్, వి.రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, రంగారావు, నాగమణి, భాను సహకారం అందించారు. డీవైఈఓలు డేనియేల్ రాజు, సుభద్ర, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, ఆర్‌వి ప్రసాద్, పి.పుల్లయ్య పర్యవేక్షించారు.

అంతర్వేదిపాలెంలో బంగారు వస్తువుల చోరీ


అంతర్వేదిపాలెంలో బాధితులతో చర్చిస్తున్న ఎస్సై రాము

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అంతర్వేదిపాలెంలో సోమవారం రాత్రి చెరుకోట రాజేష్ ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం ఉదయం ఇంటికి తాళాలు వేసుకుని ఊరు వెళ్లిన రాజేష్ కుటుంబ సభ్యులు మంగళవారం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. వివరాలు ఎస్సై ఎస్.రాము మీడియాకు తెలిపారు. ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు రెండు ఐరన్ బీరువాలను పగులగొట్టి ఐదు కాసుల బంగారం వస్తువులు అపహరించారు. ఈ మేరకు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు. కాగా ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్సై, అమలాపురం నుంచి క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు.

వయోవృద్ధుల సంక్షేమంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం వయోవృద్ధుల సంక్షేమంపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి వయోవృద్ధుల హక్కులు, వాటి పరిరక్షణకు ఉన్న చట్టాలు, నల్సా వయోవృద్ధులకు న్యాయ సేవల పథకం 2016పై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007ను వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత వారి పిల్లలపై ఉంటుందన్నారు. తల్లిదండ్రుల పట్ల పిల్లలు అగౌరవంగా వ్యవహరించినా, వారిని వేధింపులకు గురి చేసినా చట్ట రీత్యా నేరమన్నారు. ఈ చట్టం ప్రకారం వయోవృద్ధుల పోషణను నిర్లక్ష్యం చేసిన పక్షంలో మెయింటెనెన్స్ కోసం ఆర్డీవో ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసుకోవచ్చన్నారు. సంబంధిత న్యాయస్థానంలో 125 సీఆర్పీసీ ప్రకారం పిటిషన్ వేసుకోవచ్చున్నారు. విశేష అనుభవం గల పెద్దవారిని ప్రేమపూర్వకంగా ఆదరించే పిల్లలు, కుటుంబాల వల్ల సమాజం మరింత మెరుగ్గా ఉంటుందన్నారు. వయోవృద్ధులకు ఎలాంటి న్యాయ సమస్యలు ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సేవలను పొందవచ్చన్నారు. సదస్సులో ఐటీఎస్ జీఎం పలివెల రాజు, డీజీఎం జీవీ మనోజ్‌కుమార్, డీజీఎం జీఎం సత్యనారాయణ, పారా లీగల్ వలంటీర్ జీఎస్‌వీఎస్ఎస్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీటీఈ పరిధిలోకి ఆ కోర్సులు తీసుకురావొద్దు


నన్నయ వీసీ ఆచార్య పద్మరాజుకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

రాజానగరం: ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) పరిధిలోకి బీబీఏ, బీసీఏ, బీహెచ్ఎం డిగ్రీ కోర్సులు రాకుండా చూడాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజును యూనివర్సిటీ ఎఫిలేటెడ్ కాలేజ్ మెనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు కోరారు. యూనివర్సిటీలో మంగళవారం సమావేశమైన అసోసియేషన్ సభ్యులు ఈ విషయమై చర్చించారు. పై కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి తీసుకురావాలనుకోవడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. అనంతరం వీసీని కలుసుకుని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. దీనివల్ల రాబోయే రోజులలో డిగ్రీ కాలేజీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, యూనివర్సిటీలు కూడా తమ సార్వభౌమాధికారాన్ని కోల్పోతాయన్నారు. వీసీని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు గంధం నారాయణరావు, యూనివర్సిటీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు టీకే విశ్వేశ్వరరెడ్డి, అధ్యక్షులు కేవీఆర్ఎన్ నరసింహరావు, మల్లిడి అనంతరెడ్డి, సాంబశివరావు, గంగిరెడ్డి, సత్యనారాయణ, గణేష్ చౌదరి, బర్ల సత్యనారాయణ ఉన్నారు.

రామాలయం.. మరపురాని సువర్ణాధ్యాయం


అయోధ్య రామాలయాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు, డాక్టర్ తేతలి దశరథరామారెడ్డి దంపతులు

అనపర్తి: అయోధ్యలో రామాలయ నిర్మాణం మరపురాని సువర్ణాధ్యాయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అయోధ్యను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహత్తర ఘట్టమని, ఈ సమయంలో అయోధ్యను సందర్శించి స్వామి విగ్రహాన్ని దర్శించుకోవడం మరపురాని అనుభూతి అన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం స్వామివారి దివ్యమంగళ రూపాన్ని అతి సమీపం నుంచి చూసి, తమ జీవితాలు ధన్యమయ్యాయని ఎమ్మెల్యే దంపతులు పేర్కొన్నారు. ఈ అయోధ్య యాత్రలో హైదరాబాద్ యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ చీఫ్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథరామారెడ్డి, సింధు దంపతులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం సీసాల స్వాధీనం

కరప: ఒక ఇంటిలో అక్రమ మద్యం ఉన్నట్టు సమాచారం రావడంతో ఆ ఇంటిపై కరప పోలీసులు దాడిచేసి, 84 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు... మండలంలోని పెద్దాపురప్పాడు శివారు వై.సావరంలో వాసంశెట్టి సత్యనారాయణ వైన్‌షాపులలో మద్యం సీసాలు కొనుగోలు చేసి, పరిసర గ్రామాల్లో అమ్ముతుంటాడు. వై.సావరంలో అక్రమ మద్యం సీసాలు దాచి ఉంచినట్టు మంగళవారం కరప పోలీసుస్టేషన్‌కు సమాచారం వచ్చింది. ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో వై.సావరంలో సత్యనారాయణ ఇంటిక్లో తనిఖీ చేయగా 84 క్వార్టర్ బాటిల్స్ దొరికాయి. నిందితుడి నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. నిందితుడిని బుధవారం కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్లు వాడితే నేరం


సిలిండర్లు, నిందితుడితో తనిఖీ అధికారులు

రాజానగరం: వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ (గృహ) సిలిండర్లు వాడితే చట్టరీత్యా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి ఎ.సురేష్‌బాబు హెచ్చరించారు. రాజానగరం మార్కెట్ రోడ్డులోని రెస్టారెంట్లు, కర్రీ పాయింట్లలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అమృత రెస్టారెంట్ అండ్ కర్రీ పాయింట్‌లో ఐదు డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనపర్చుకుని, యజమాని పామర్తి రమేష్‌పై 6ఏ కేసును నమోదు చేశారు. తనిఖీలో కార్యాలయ సీఐ జగన్నాథరెడ్డి, డీసీటీఓ షబ్బీర్, హెచ్‌సీ జీవానందం, కానిస్టేబుల్ లోవరాజు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ దరఖాస్తుకు 30 వరకూ గడువు

నల్లజర్ల: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్లో ప్రవేశానికి ఈనెల 30వ తేదీలోగా తత్కాల్ ద్వారా రూ.1000 అదనంగా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని దూబచర్ల లోని స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి చదువుకోలేని వారికి, ఉన్నత ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారికి ఇది సదవకాశం అని తెలిపారు. టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారికి ఇది మంచి అవకాశం అన్నారు.వివరాలకు 94903 50035 అనే నంబర్‌లో సంప్రదించాలన్నారు.